కేటీఆర్‌ను కలిసి మర్పల్లి ఘటనను వివరించి..

తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌తోపాటు మర్పల్లి మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు మర్పల్లిలో జరిగిన సంఘటనను వారు వివరించారు. మాజీ మంత్రిని కలిసిన వారిలో మర్పల్లి మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మధుకర్, మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, వికారాబాద్ కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మధుకర్ తదితరులు ఉన్నారు.

-వికారాబాద్, సెప్టెంబర్ 25

కొత్లాపూర్ ఎల్లమ్మను దర్శించుకున్న కర్ణాటక మాజీ మంత్రి

మండలంలోని కొత్లాపూర్ గ్రామంలో కొలువైన శ్రీ రేణుకా ఎల్లమ్మను బుధవారం కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి అరవింద నింబవళి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తమ ఇలవెల్పు ఎల్లమ్మ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిలు, ఆలయ మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. -తాండూరు రూరల్, సెప్టెంబర్ 25

షాద్‌నగర్ శ్రీవారి సేవలో సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్

షాద్‌నగర్ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం లో బుధవారం ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నా రు. ఆర్పీని ఆలయ అర్చకులు ఆశీర్వదించి ప్రసాదాన్ని అందజేశారు. దేవాలయానికి సంబంధించిన స్థల పురాణం, విశేషాలను మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు కిశోర్ వారికి వివరించారు. శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆయనను స్థాని క భక్తులు, నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు, నాయకులు సాయిశ్వర్‌రెడ్డి, భూపాల్ పాల్గొన్నారు. -షాద్‌నగర్ టౌన్, సెప్టెంబర్ 25

ప్రొటోకాల్ పాటించడంలేదు..

ప్రజాప్రతినిధుల పట్ల షాద్‌నగర్ మున్సిపల్ అధికారుల ఇష్టారాజ్యం

- ఎమ్మెల్యే హాజరైనా.. అందని సమాచారం
- మున్సిపల్ కమిషనర్, మేనేజర్‌పై మున్సిపల్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్ల మండిపాటు

ఎమ్మెల్యే వస్తున్నారనే సమాచారం ఎందుకు ఇవ్వలేదని మున్సిపల్ కమిషనర్‌ను అడుగుతున్న మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్

షాద్‌నగర్, సెప్టెంబర్ 25 : ప్రజాప్రతినిధులు కనీస గౌరవ మర్యాదలకు కూడా నోచుకోలేని దుస్థితి షాద్‌నగర్ మున్సిపల్‌లో నెలకొన్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ.. ప్రొటోకాల్ కూడా పాటించడంలేదని ప్రతిపక్ష పార్టీల నాయకులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. అధికార పార్టీ నాయకుల సూచనలే పరమావధిగా భావిస్తున్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ 2వ వార్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బుధవారం జరిగిన ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్ హాజరయ్యారు. అయితే ఈ ప్రోగ్రామ్‌కు ఎమ్మెల్యే వస్తున్నారనే విషయాన్ని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, సంబంధిత కౌన్సిలర్లకు అధికారులు సమాచారం ఇవ్వలేదు. ఈ విషయంపై మున్సిపల్ చైర్మన్ నరేందర్..మున్సిపల్ కమిషనర్, మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ముందు మమ్మల్ని తక్కువ చేసేందుకే ఇలా ప్రవర్తిస్తున్నారా..? ఇదెక్కడి సంప్రదాయం.. కనీస గౌరవం ఇవ్వరా..? ఎమ్మెల్యే ప్రోగ్రామ్ ఉందనే విషయం కౌన్సిల్ సభ్యులకు తెలియకుంటే ఎలా..? ఎమ్మెల్యేకు మున్సిపల్ కౌన్సిల్‌కు సంబంధం ఉండదా..? వారి సేవలు మున్సిపల్‌కు అవసరం లేదా..? అన్ని మీరే నిర్ణయిస్తారా అంటూ మున్సిపల్ అధికారుల పనితీరును ప్రజల ముందే ఎండగట్టారు. ఇదిలా ఉంటే గతంలోనూ మున్సిపల్ కమిషనర్ వెంకన్న కనీస గౌరవ మర్యాదలు ఇవ్వడంలేదని మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నిష్పక్షపాతంగా పని చేయాల్సిన అధికారులు, అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలకడం తగదని పలువురు పేర్కొంటున్నారు.

పరీక్ష రాస్తున్న పోలీసులు

నైపుణ్య అభివృద్ధికి డ్యూటీ మీట్‌లు ఎంతో దోహదం

వికారాబాద్ అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి

వికారాబాద్, సెప్టెంబర్ 25 : నైపుణ్య అభివృద్ధికి డ్యూటీ మీట్‌లు ఎంతో దోహదం చేస్తాయని వికారాబాద్ అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీసులకు నేరాలకు సంబంధించిన అంశాలపై రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు జరిగిన స్థలంలో సేకరించాల్సిన పలు వివరాలతోపాటు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ చేయు విధానం వంటి అంశాల్లో రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించామన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జోనల్ స్థాయికి పంపిస్తామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పనితనాన్ని మెరుగుపర్చేందుకు జిల్లా స్థాయి, జోనల్ స్థాయి ,రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పోలీస్ డ్యూటీ మీట్‌లను నిర్వహిస్తారని తెలిపారు. ఇలాంటి డ్యూటీ మీట్‌లతో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా డీసీఆర్బీ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీసీఆర్బీ సీఐ ఆంజనేయులు, డాక్టర్ నిఖిల్, జిల్లా లోని సీఐలు, ఎస్ఐలు, ,ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

3న పెద్దఅంబర్‌పేట చైర్‌పర్సన్ ఎన్నిక

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 25: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ తొలగింపు, కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ చురుగ్గా సాగుతున్నది. అక్టోబర్ 3న కొత్త చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలని ఈసీ ఆదేశించింది. ఎన్నికకు అధికారులు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. మెజారిటీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై అవిశ్వాసం కోరగా.. ఈ నెల 13న జరిగిన బలపరీక్షలో 17 మంది సభ్యులు స్వప్నకు వ్యతిరేకంగా ఓటేశారు. ఆమెను పదవి నుంచి తొలగిస్తూ రెండ్రోజుల కిందటే ప్రభుత్వం ఉత్తర్వులు, గెజిట్‌నూ విడుదల చేసింది. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఖాళీ అయింది. కొత్త చైర్‌పర్సన్ ఎన్నికకు ప్రత్యేక సమావేశం నిర్వహణ కోసం ఈ నెల 30లోపు కౌన్సిల్ సభ్యులందరికీ అధికారులు నోటీసులు ఇవ్వనున్నారు.

వయోవృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు

వికారాబాద్, సెప్టెంబర్ 25 : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలను మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి అక్టోబర్ 1 వరకు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారిణి కృష్ణవేణి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వృద్ధాశ్రమాల్లోని వయోవృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం-2007పై అవగాహన కల్పిస్తామన్నారు. వయోవృద్ధుల టోల్ ఫ్రీ నంబర్ 14567 పై అవగాహన సదస్సు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాండ్ పేరెంట్స్ డే వంటివి ఉంటాయన్నారు.

రంగారెడ్డి జిల్లా శిశు, సంక్షేమ శాఖ అధికారిణి పద్మజారమణ

ఉప్పరిగూడ రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా శిశు, సంక్షేమశాఖ అధికారిణి పద్మజారమణ

ఇబ్రహీంపట్నం రూరల్, సెప్టెంబర్ 25 : బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా శిశు, సంక్షేమ శాఖ అధికారిణి పద్మజారమణ అన్నారు. మండలంలోని ఉప్పరిగూడ రైతువేదికలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణమాసం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని, కిశోర బాలికలు రక్తహీనత సమస్య బారిన పడకుండా వారిని కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. గృహిణి ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుపడుతుందని గుర్తు చేశారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఎత్తుకు తగ్గ బరువు, ఎస్ఏఎం, ఎంఏఎం పిల్లలకు ఆర్‌బీఎస్‌కే ద్వారా హెల్త్‌స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాగే, వారికి అవసరమైన మందులతోపాటు బాలామృతాన్ని పంపిణీ చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీ వైద్యురాలు సరిత, సీడీపీవో తులసి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలి

జోరుగా ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్

చేవెళ్లలో ఆయిల్‌పామ్ మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్, సెప్టెంబర్ 25 : రంగారెడ్డి జిల్లాలో బుధవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. జిల్లావ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పాడు గ్రామంలో జరిగిన ప్రోగ్రామ్‌లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి , కల్వకుర్తి సెగ్మెంట్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, చేవెళ్ల సెగ్మెంట్‌లో కాలె యాదయ్య పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం లోని మూడు మండలాల్లోని 11 గ్రామాల్లో 21 మంది రైతుల పొలాల్లో 3,539 మొక్కలు, కల్వకుర్తి సెగ్మెంట్ లోని నాలుగు మండలాలు 13 గ్రామాల్లోని 64 ఎకరాల్లో 3,666 మొక్కలు, చేవెళ్ల సెగ్మెంట్‌లోని మూడు మండలాల్లోని 8 గ్రామాల్లో 15 మంది రైతుల పొలాల్లో 1614 మొక్కలు, మహేశ్వరం సెగ్మెంట్‌లోని రెండు మండలాలోని ఐదు గ్రామాల్లో 10 మంది రైతుల 31 ఎకరాల్లో 1,779 మొక్కలు, షాద్‌నగర్ సెగ్మెంట్లోని ఆరు మండలాల్లోని 14 గ్రామాల్లో 32 మంది రైతుల పొలాల్లో 6,555 మొక్కలు నాటినట్లు జిల్లా ఉద్యానవన అధికారి సురేశ్ తెలిపారు. జిల్లాలోని 302 ఎకరాల్లో 17,214 మొక్కలు నాటామని, మూడు వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

ఎంఈవోల నియామకం పూర్తి

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 25 : వికారాబాద్ జిల్లాలోని అన్ని మండలాలకు మండల విద్యాధికారులను నియమిస్తూ విద్యాశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు కొడంగల్, తాండూరు, యాలాల, వికారాబాద్, కోట్‌పల్లి, కులకచర్ల, నవాబుపేట మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలు ఉన్నారు. వీరే మిగిలిన 13 మండలాలకూ ఇన్‌చార్జీలుగా బాధ్యతలు నిర్వర్తించేవారు. దీంతో పనిభారం ఎక్కువై పాఠశాలల పర్యవేక్షణ లోపిస్తున్నదని భావించిన విద్యాశాఖ ప్రతి మండలానికీ ఒక ఎంఈవో ఉండాలన్న ఉద్దేశంతో మిగిలిన 13 మండలాలకు కూడా ఇన్‌చార్జి ఎంఈవోలను నియమించింది.

మండలంలోని సీనియర్ జీహెచ్ఎను ఆ మండలానికి ఇన్‌చార్జి ఎంఈవోగా నియమించారు. బంట్వారం మండలానికి వెంకటేశ్వరరావు, బషీరాబాద్‌కు విజయకుమార్, బొంరాస్‌పేటకు హరిలాల్, చౌడాపూర్‌కు రాంచందర్, ధారూరుకు శ్రీనివాస్‌రెడ్డి, దోమకు వెంకట్, దౌల్తాబాద్‌కు వెంకటస్వామి, దుద్యాలకు విజయరామారావు, మర్పల్లికి అంజిలయ్య, మోమిన్‌పేటకు మల్లేశం, పరిగికి గోపాల్, పెద్దేముల్‌కు నర్సింగ్‌రావు, పూడూరుకు సాయిరెడ్డిలను ఇన్‌చార్జి ఎం ఈవోలుగా నియమించారు.

ఎంఈవోల నియామకంతో జిల్లాలోని అన్ని మండలాలకు ఎంఈవోలు ఉన్నట్లయింది. అయితే అందరూ ఇన్‌చార్జి ఎంఈవోలే కావడం గమనార్హం. ఒక్కరూ రెగ్యులర్ ఎంఈవో లేరు.

ఎక్కుతుండగా కదిలిన బస్సు

- కిందపడిన పారిశుధ్య కార్మికురాలు
- రెండు కాళ్ల పై నుంచి వెళ్లిన టైర్లు.. తీవ్రగాయాలు
- చికిత్స పొందుతూ మృతి

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 25 : ఆర్టీసీ బస్సు ఓ ప్రాణాన్ని బలిగొన్నది. డ్రైవర్ నిర్లక్ష్యంతో కదిలిన బస్సు చక్రాలు జీహెచ్ఎంసీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న మహిళ ఊపిరి తీశాయి. ఈ ఘటన బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల ప్రకారం.. మండలంలోని గుంతపల్లికి చెందిన బరిగల రాములమ్మ (67) జీహెచ్ఎంసీలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నది. విధుల అనంతరం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో పూలను విక్రయిస్తుండేది. బుధవారం మధ్యాహ్నం పూలు విక్రయించి తిరిగి గుంతపల్లికి వెళ్లేందుకు అబ్దుల్లాపూర్‌మెట్‌లోని షాడో దవాఖాన సమీపంలోని బస్టాండ్‌లో వేచి చూస్తున్నది. అదే సమయంలో హయత్‌నగర్ ఆర్టీసీ డిపో Ts 07 UE 5558 బస్సు వచ్చి అక్కడ ఆగింది. కొంతమంది మహిళలు ఎక్కారు. ఆ వెనకే రాములమ్మ ఎక్కుతుండగా.. గమనించని డ్రైవర్ ముందుకు కదిలించినట్లు తెలుస్తున్నది. దీంతో రాములమ్మ కిందపడిపోయింది. డ్రైవర్ గమనించక నిర్లక్ష్యంగా బస్సును ముందుకు తీసుకెళ్లడంతో ఆమె రెండు కాళ్ల పై నుంచి టైర్లు వెళ్లి తీవ్రగాయాలయ్యాయి. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రురాలిని కామినేని దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాములమ్మ మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాద స్థలిలో బస్సు, గుమిగూడిన జనం

బీసీ మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కడ్తాల్, సెప్టెంబర్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. సమగ్ర కుల గణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న కల్వకుర్తి పట్టణంలో నిర్వహించ తలపెట్టిన బీసీల మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆయన బీసీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి రవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, నాయకులు ఆంజనేయులు, మల్లేశ్‌గౌడ్, శేఖర్, వెంకటేశ్, మల్లేశ్, రాజేశ్, లింగం, మైసయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ తయారీపై సమీక్ష నిర్వహిస్తున్న డీటీసీపీ అధికారులు

మాస్టర్ ప్లాన్ తయారీపై వివరాల సేకరణ

కడ్తాల్, సెప్టెంబర్ 25 : మండల కేంద్రంలో మాస్టర్ ప్లాన్ తయారీపై డీటీసీపీ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో డీటీసీపీ టౌన్ ప్లానింగ్ ఏడీ సత్యభామ, అధికారిణి సువర్ణ ఆధ్వర్యంలో కడ్తాల్ పూర్వ గ్రామ పంచాయతీలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాత రెవెన్యూ పరిధిలోని గ్రామ పంచాయతీలను కలుపుతూ, మండల కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఇండికేటివ్ ల్యాండ్ యూస్ ప్లాన్ ముసాయిదా తయారీపై మ్యాపుల సహాయంతో అధికారులు సమీక్ష నిర్వహించారు. పాత రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, భూములు, చారిత్రాక కట్టడాలు, ప్రార్థనామందిరాలు, రహదారులు, భవనాలు, లేఅవుట్లు, నక్షదారులు తదితర వివరాలకు సంబంధించి సేకరించిన డేటాపై అధికారులు చర్చించారు.

చెరువులు, కుంటలపై సమగ్ర సమాచారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జాతీయ రహదారికి ఇరువైపులా చేపడుతున్న ఇండ్ల నిర్మాణాలు, రహదారులు, ట్రాఫిక్‌కు అనుగుణంగా నివాస, వాణిజ్య, పరిశ్రమ, పబ్లిక్, సెమీ పబ్లిక్, వ్యవసాయం సెక్టార్ల పరిధి మొత్తాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. సేకరించిన సమాచారం ప్రజల ఉపయోగార్థం ఐఎల్‌యూపీ మాస్టర్ ప్లాన్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. ముసాయిదా రూపకల్పనలో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోని మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, టౌన్ ప్లానింగ్ అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డీసీహెచ్ఎస్ రాజు

ఆమనగల్లు ప్రభుత్వ దవాఖానలో రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ రాజు

ఆమనగల్లు, సెప్టెంబర్ 25 : వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్ఎస్ రాజు అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను అకస్మాత్తుగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ దవాఖాన పనులను పరిశీలించి మాట్లాడుతూ.. వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని.. సమయపాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరీక్షిత్, నరేందర్, వైద్యులు నాగరాజు, మైమునాబేగం, హెడ్ నర్సు ఏసుమణి, నర్సింగ్ ఆఫీసర్లు అలివేలు, జ్యోతి, సంపూర్ణ, సిబ్బంది దేవేందర్, మునీరా, ఇందిర, వేణు, గోపాల్‌రెడ్డి, శ్రీను, సురేశ్, పవన్, సలీమా, మంగ, శాంతి, తదితరులు ఉన్నారు.

నిషేధిత గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

కొత్తూరు, సెప్టెంబర్ 25 : కొత్తూరు పోలీసులు బుధవారం పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. అలాగే అక్రమంగా మద్యం అమ్ముతున్న మూడు షాపులపై కేసులు నమోదు చేశారు. శంషాబాద్ ఏసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొత్తూరు, నందిగామ సీఐలు, నలుగురు ఎస్ఐలు, 70 మంది పోలీసు సిబ్బంది కొత్తూరు పట్టణంలోని పలు షాపుల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మూడు షాపుల్లో విక్రయిస్తున్న గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

28, 29 తేదీల్లో డీడీఎంఎస్ కోఫేమ్‌లో సంగీత పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 25: ఓయూ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (కోఫేమ్)లో ఈనెల 28వ తేదీ నుంచి సంగీత పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ వై.రమాప్రభ, ప్రిన్సిపాల్ కె.విజయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 28న సీనియర్, సూపర్ సీనియర్ కేటగిరీలకు, 29న జూనియర్, సబ్ జూనియర్ కేటగిరీలకు కర్ణాటక గాత్ర-వీణ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పోటీల రోజే కళాశాలకు వచ్చి సైతం స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. ఇతర వివరాలకు 94417 68811, 94413 86157 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

28న మహవీర్ కళాశాలలో మెగాజాబ్ మేళా

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 25 : మహవీర్ కళాశాలలో 28న నిర్వహించే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని మహవీర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాల ఆడిటోరియంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శనివారం 50 కంపెనీల ప్రతినిధులు వస్తారని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ అభ్యర్థులు ఐదు సెట్ల రెజ్యూమ్, కలర్ ఫొటోతో రావాలని సూచించారు. ఉదయం 9:30 గంటలకు కళాశాలలో మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, కన్వీనర్ డాక్టర్ నందగోపాల్‌రెడ్డి, డాక్టర్ ప్రతిభాభారతి, కళాశాల చైర్మన్ సంరెడ్డి జయలక్ష్మి పాల్గొన్నారు.